



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

మంగళవారం, 21, మే 2024



ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం


# మోసపోతే గోసపడ్తరు

- అమలుకాని వాగ్దానాలతో కాంగ్రెస్ కు అధికారం
- ప్రజాస్వామ్యం లో మార్పు సహజం
- ప్రశ్నించే వారిని గెలిపించండి
- ఇది మీ భవిష్యత్ ని నిర్ణయించే యుద్ధం
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడినా వొచ్చిన నష్టం లేదు
- ఒక విద్యావంతుడికి అవకాశం కల్పించండి
- పట్టభద్రుల ఆత్మీయ సమావేశ సభ లో కేటీఆర్ వ్యాఖ్యలు

2 లో..





కొత్తగూడెం, సూర్య (మేజర్ న్యూస్)- మోసపోతే గోసపడ్తరని, 6 గ్యారెంటీ లు, అమలుకు సాధ్యం కాని వాగ్దానాలతో అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వొచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. సోమవారం కొత్తగూడెం లో వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగు రాకేష్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశ సభ లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు.కేసీఆర్ తెలంగాణను అన్ని విధాలా అభివృద్ధి పదంలో నడిపించారన్నారు.

## ఎన్నికల శిక్షణ తరగతులను అధికారులు సద్వినియోగం చేసుకోవాలి

– జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

2 లో..



కొత్తగూడెం,సూర్య(మేజర్ న్యూస్) - ఎన్నికల శిక్షణ తరగతులను ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు.ఈనెల 27న జరగనున్న వరంగల్ - ఖమ్మం- నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికలలో భాగంగా ఎన్నికల సిబ్బందికి సోమవారం ఐ డి ఓ సి కార్యాలయంలోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపైసంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

## విదేశాల్లో కోట్ల రూపాయల సంపాదన వదిలి ప్రజా సేవకై వచ్చాడు ఆశీర్వదించండి....

-బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



2 లో..

# లాగేకొద్ది సాగుతున్న అక్రమాల డొంక

-ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు పట్టా చేసింది ఎవరు?

-రెవెన్యూ అధికారుల ఉదాసీనతకు కారణమేమిటి?

-తహసిల్దార్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న వైనం

-కబ్జా కోరల్లో కోట్ల విలువైన ప్రభుత్వ భూమి

-సామాన్యులకు ఒక న్యాయం బడా బాబులకు మరొక న్యాయమా

2 లో..





# విదేశాల్లో కోట్ల రూపాయల సంపాదన వదిలి ప్రజా సేవకై వచ్చాడు ఆశీర్వదించండి....





ఇల్లందు, సూర్య (మేజర్ న్యూస్)– తన చిన్ననాటి నుండి కష్టపడి చదివి బిట్స్ పిలాని లాంటి గొప్ప విద్యా సంస్థల్లో సీటు సాధించి , విదేశాల్లో ఉద్యోగం పొంది, కోట్లాది రూపాయలను సంపాదిస్తున్న ఏనుగుల రాకేష్ రెడ్డి ప్రజా సేవ చేయాలన్న ఆకాంక్షతో అవన్నీ వదులుకొని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ఇలాంటి వ్యక్తిని గెలిపించవలసిన అవసరం ఎంతైనా ఉందని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కలవకుంట్ల తారక రామారావు కోరారు. సోమవారం రాకేష్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఇల్లందు పట్టణంలోని జే కే కాలనీ సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో జరిగిన ఆత్మీయ సమ్మేళనం లో కేటీఆర్ మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రతిపక్షంలో ఉంటేనే ప్రశ్నించే గొంతుకై మాట్లాడుతారని, గతంలో కూడా బిజెపి పార్టీ టికెట్ రాకేష్ రెడ్డి పోటీ చేశారని ఆయన అన్నారు. విద్యార్థి దశ నుండి రాకేష్ రెడ్డి ప్రశ్నించే మనస్త త్వం కలిగినవాడని, పట్టభద్రుల సమస్యలు గుర్తుతెరిగిన రాకేష్ నీ గెలిపిస్తే శాసనమండలిలో సమస్యలను లేవనెత్తుతారని ఆయన అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అవసరమైన పనులు చేస్తూనే పోయాం తప్ప ప్రచారం చేసుకోలేకపోవడం వల్లనే ఓడిపోవలసి వచ్చిందని, రైతులకు నాట్ల సమయంలో రైతు బంధు వేయకుండా ఓట్ల సమయంలో వేయిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. అనంతరం ఆర్ఎస్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల, నిరుద్యోగుల, పట్ట బద్రులపట్ల ఏమాత్రం అవగాహన లేని కొందరు పోటీలో ఉన్నారని, సంస్కారం లేని మాటలు మాట్లాడుతున్నారని, వీరి మధ్య తేడాను పట్టభద్రులు తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు అధ్యక్షత వహించగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ వద్దిరాజు రవిచంద్ర, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, మహబూబాబాద్ జడ్పీ చైర్మన్ బిందు, టిఆర్ఎస్ జిల్లా నాయకులు దిండిగాల రాజేందర్, సిలివేరి సత్యానారాయణ, లక్కినేని సురేందర్ ,కార్మిక నేత ఎస్ రంగనాథ్, కౌన్సిలర్లు జేకే శ్రీను, అనిత, పద్మావతి , మాధవి, పద్మ, స్వాతి, తోట లలితా శారద, ఖమ్మం పాటి రేణుక, పివి కృష్ణారావు ఎస్కే నభి, చాంద్ పాషా, ఎలమద్ది రవి, పరుచూరి వెంకటేశ్వరరావు, గిన్నారపు రాజేష్, ఎం టెక్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం మాజీ మంత్రి కేటీఆర్ ను, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని ఇల్లందు ఏరియా పార్టీ నాయకులు పూలమాలతో సత్కరించారు.

# మోసపోతే గోసపడ్తరు

ఐనప్పటికి కాంగ్రెస్ విచ్చలవిడి తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వొచిందన్నారు. ప్రజలు మార్పును కోరుకున్నారని, అధికారం ఎవడబ్బ సొమ్ముకాదని స్పష్టం చేశారు. మార్పును స్వాగతిస్తున్నామని తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి నిత్యం పోరాడుతామన్నారు.గడచిన కొద్దిరోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ వైఖరి ప్రజలకు అర్థమైందన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక ప్రచారాల్లో తెలంగాణలో 6 గ్యారెంటీలు అమలుచేసామంటూ ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేసుకుంటున్నారని, ఆరు గ్యారెంటీలు ప్రజలకు చేరాయా???, రూ 2500లు మహిళలకు అందాయా అని ప్రశ్నించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు 2లక్షల ఉద్యోగాలు ఇచ్చామని వాటిని ప్రచారం చేసుకొని నిరుద్యోగుల మద్దతు పొందడంలో విఫలమయ్యామన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే 30వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటున్నారని అవి కేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్న రోజుల్లో శ్రీకారం చుట్టినవేనని, కేసులు , లీకులు పేరుతో ప్రభుత్వం పై భారీగా దృష్ప్రచారం
చేసి అపడంతో వాటిని నిరుద్యోగులకు అందించడంలో ఆలస్యమైందని పేర్కొన్నారు.

–అబద్ధాల రేవంత్ ప్రభుత్వన్నీ నమ్మకండి... కేటీఆర్

కాంగ్రెస్ 65 ఏండ్ల పాలనలో చేసింది శూన్యం మని అన్నారు. అభివృద్ధి జరిగింది కేసీఆర్ హయం లొనే అని స్పష్టం చేశారు. కొత్తగూడెం అగ్నిగుండం మని, తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన ప్రాంతమని గుర్తు చేశారు. కొత్తగూడెం లో ఏనాడైనా మెడికల్ కాలేజ్ వొస్తుందని అనుకున్నారా! కొత్తగూడెం ని జిల్లా అవుతుందని భావించారా! అవి సాధ్యం చేసిన ఘనత



కేసీఆర్ దేనన్నారు. మోసం చేసి అధికారంలోకి వొచ్చిన కాంగ్రెస్ ఊసరవెల్లిలా రంగులు మర్చినట్లు పథకాలు అమలుచేయడంలో తేదీలు మారుస్తున్నారని విమర్శించారు.

–గోల్డ్ మెడలిస్ట్ ఓవైపు బ్లాక్మెయిలర్ ఓవైపు ఎవరు కావాలి?... కేటీఆర్

సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించి, బిట్స్ పిలానిలో చదివి, గోల్డ్ మెడల్ సాధించి, అమెరికాలో ఉన్నత ఉద్యోగం చేస్తూ, మాతృభూమి కి, తన ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో భోగాలన్నీ వదులుకొని వొచ్చిన వ్యక్తి ఏనుగుల రాకేష్ రెడ్డి
అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడినా వొచ్చిన నష్టం లేదని యువత హక్కుల సాధనలో శాసనమండలిలో ధిక్కార స్వరం ఉండాలని, అధికారం స్వరం కాదని అన్నారు. ఇవతల గోల్డ్ మెడలిస్ట్ అవతల బ్లాక్మెయిలర్ పోటీలో ఉన్నారని ఎవరుకావలో ఆలోచన చేయాలన్నారు. ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే అధికారపక్షంతో పాటు ప్రతిపక్షం కూడా బలంగా ఉండాలన్నారు. విద్యావంతులు గ్రాడ్యుయేట్లు ఉదాసీనంగా ఉంటే మోసానికి ఓటేసినట్లేనని తెలిపారు. మొదటిసారి మోసం జరిగితే మోసం చేసినవాడు తప్పు, కానీ మళ్ళీ అదే వ్యక్తి చేతిలో రెండోసారి కూడా మోసపోతే ఈసారి తప్పు మనది అవుతుంది గుర్తుపెట్టుకోండని హెచ్చరించారు.ప్రజల తరపున గలమెత్త కొట్లాడాలంటే రాకేష్ రెడ్డి లాంటి విద్యావంతులకు అవకాశం ఇవ్వాలని అభ్యర్ధించారు. ఈ ఆత్మీయ సమావేశ సభ లో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్ల, మెచ్చ నాగేశ్వరరావు, బాణోత్ హరిప్రియ, దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మీ, బిఆర్ఎస్ పార్టి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల శిక్షణ తరగతులను అధికారులు సద్వినియోగం చేసుకోవాలి

26వ తారీఖున శ్రీ రామచంద్ర ఆర్ట్స్ కాలేజ్ లో అందరికీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఉంటుందని, అదేవిధంగా 27వ తారీఖున రిసెప్షన్ కూడా అక్కడే ఉంటుందని తెలిపారు. గత పార్లమెంట్ అసెంబ్లీ ఎలక్షన్లకు భిన్నంగా ఈ ఎమ్మెల్సీ ఎన్నికల నందు ఆర్డర్ ఆఫ్ ప్రయారిటీ వైస్ గా నెంబర్ ద్వారా ఓటు వేయవలసిందిగా పోలింగ్ స్టేషన్లో ఇచ్చిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్ అనే వాడవల్సిందిగా ఇంకా ఏ విధమైన నెంబర్లు కాని పేర్లు కానీ సిగ్నేచర్ లు కానీ రాయకూడదని తెలియజేశారు. బ్యాలెట్ బాక్స్ ల ద్వారా బ్యాలెట్ పేపర్ ని నిలువుగా ముందు తర్వాత అడ్డంగా మడిచి బ్యాలెట్ పేపర్ను బ్యాలెట్ బాక్స్ లో వేయవలసిందిగా తెలియజేశారు. ముఖ్యమైన నిబంధనలు పట్ల అవగాహన కలిగి ఉంటే నమ్మకంతో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించవచ్చునన్నారు. పోలింగ్ జరిగే సమయంలో పోలింగ్ కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు, ఓటింగ్ కంపార్ట్మెంట్ రూపొందించడం, ఓటర్ గోప్యంగా తన ఓటు హక్కును యోగించుకునేందుకు అవకాశం కల్పించడం వంటి ఏర్పాట్లపై ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తీసుకోవలసిన చర్యలు, వారికున్న హక్కులు, బాధ్యతలను సంపూర్ణంగా తెలుసుకొని ప్రతి పోలింగ్ అధికారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ను సద్వినియోగపరచుకొని తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల సిబ్బంది అందరూ ఫామ్ 12 ని ఉపయోగించుకొని ఐ డి ఓ సి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకొనుటకుగాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని, అందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ, ఎన్నికల సూపర్డెంట్ ధారా ప్రసాద్, ట్రైనింగ్ నోడల్ అధికారి అలీమ్, డిఎల్ఎంటి పూసపాటి సాయి కృష్ణ, కిరణ్ కుమార్, పిఓ ఏ పిఓ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# లాగేకొద్ది సాగుతున్న అక్రమాల డొంక

చర్ల, సూర్య (మేజర్ న్యూస్)– వడ్డించేవారు మన వారైతే బంతిలో చివరన కూర్చున్న అన్ని అందుతాయనే సామెత చర్ల మండలంలో అక్రమార్కులకు బాగా సరిపోతుంది. వారు అక్రమాలకు అధికారులు అండదండలు అందించినంత కాలం వారి దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. ప్రభుత్వ భూములే కదా ఎవరు అడుగుతారనే ధైర్యంతో మండలంలోని విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు రెవెన్యూ అధికారులు ధారా దత్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే చర్ల మండలం మొగలపల్లి రెవెన్యూ సెక్కులో 45,46 సర్వే నెంబర్లు గల భూములు 2010–11 లో రెవెన్యూ రికార్డులలో పోరంబోకు భూములుగా నమోదయి ఉన్నాయి. కానీ ఇప్పుడు ఆ భూములు ప్రైవేట్ వ్యక్తుల పేరిట ధరణి పోర్టల్ లో దర్శనమిస్తున్నాయి. గతంలో చర్ల మండలానికి చెందిన వ్యక్తి ఒకరు రెవెన్యూ అధికారులకు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయగా వారు అతనికి ఇచ్చిన మాన్యువల్ అడంగల్ పహాణీలో 45,46 సర్వే నెంబర్లు పోరంబోకు భూములుగా పేర్కొన్నారు. కాగా 2017 వ సంవత్సరం ఈ భూములను కొందరు వ్యక్తులు అప్పటి తహసిల్దారుకు భారీ మొత్తంలో లంచం ముట్ట చెప్పి విలువైన భూములను పట్టా చేయించుకున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. లేకపోతే రెవెన్యూ రికార్డులలో అప్పటివరకు పోరంబోకుగా ఉన్న భూమి ప్రైవేట్ వ్యక్తుల పేరిట ఎలా మారిందని స్థానికుల ప్రశ్నిస్తున్నారు. ఈ భూమిలోనే గత వారం రోజులుగా చెరువు చదును పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతున్నారు. తవ్వకాలు మొదలైన మూడవరోజు స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. స్థానికుల నుండి ఒత్తిడి ఎక్కువ అవడంతో సోమవారం చర్ల తహసిల్దార్ తన సిబ్బందితో కలిసి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. తవ్వకాలు ఆపివేసి యంత్రాలను సీజ్ చేసి కార్యాలయాలయానికి తీసుకురమ్మని రెవెన్యూ ఇన్స్పెక్టర్ ను ఆదేశించగా ఆయన తవ్వకాలు చేపడుతున్న వారికి అదే విషయం చెప్పగా మేము ఆపము, మా వద్ద అన్ని ఉన్నాయి, మీరు మాకు నోటీసు ఇస్తే మీ వద్దకు మేము వస్తాము అని సమాధానం చెప్పడంతో రెవెన్యూ ఇన్స్పెక్టర్ అక్కడి నుండి వెనుదిరిగారు. మా వద్ద అన్ని ఉన్నాయి అంటే ఏమిటి అని స్థానికులు చర్చించుకుంటున్నారు. సొంత భూమి అయినా తవ్వకాలు చేపట్టాలంటే మైనింగ్ శాఖ అనుమతులు తప్పనిసరి.కానీ ఈ చెరువు తవ్వకాలకు మైనింగ్ శాఖ నుండి ఎటువంటి అనుమతులు లేవనేది సమాచారం. చెరువు పక్కనే ఉన్న తాలిపేరు కాలువకు ఇరిగేషన్ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రెండు చోట్ల గండి పెట్టారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టం వచ్చినట్లు తవ్వుతున్నా రెవెన్యూ శాఖ అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శించడం పట్ల స్థానికుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు అందవలసింది అందబట్టే వారు తమకేమీ పట్టనట్లుగా మౌనంగా ఉన్నారని మండల కేంద్రంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి పాత రికార్డులను పరిశీలించి ప్రభుత్వ భూమిని కొందరు లంచగొండి అధికారుల అండతో అక్రమంగా పట్టాలు చేయించుకొన్న వ్యక్తులపై, ప్రభుత్వ భూమిని తాతగారి ఆస్తిలా ప్రైవేటు వ్యక్తులకు పందేరం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# వైభవంగా బీరప్ప కామరాతి కళ్యాణం..

-పట్టు వస్త్రాలను సమర్పించిన మారగాని..
-స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే
-స్వామివారిని దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తులు..







అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)-మండల పరిధిలోని పెంట్లం గ్రామంలో నిర్వహిస్తున్న బీరప్ప కామరాతి కళ్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. గత మూడు రోజులుగా గ్రామంలో బీరప్ప ఉత్సవాలను కురమ సోదరులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా డోలు చప్పుళ్ళు ,ఒగ్గు కళాకారుల విన్యాసాలు, శివశక్తుల పూనకాలు, స్వాములకు గంగ స్నానం, బోనాలతో మహిళలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు ఆలయ ఆవరణంలో బీరప్ప కామరాతి కళ్యాణాన్ని ఆలయ అర్చకులు జరిపించారు. హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ పునర్నిర్మాణ ధర్మకర్త, ఆలయాల అభివృద్ధి ప్రదాత మారగాని శ్రీనివాసరావు ఆదేశానుసారం స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రాలు, 25 వేల రూపాయలు నగదును విరాళాలంగా శ్రీ అంకమ్మ తల్లి ఆలయ చైర్మన్ పానుగంటి రాఘవులు, ఆలయ పూజారి కాలసాని పుల్లయ్య, ఎమ్మెస్సార్ యూత్ సభ్యులు చల్లా రమేష్ ఆలయ కమిటీకి అందజేశారు. ఉత్సవాలలో అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు .ఆయనకు తొలుత ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికారు. అర్చకులు పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందజేశారు. కురుమల ఆరాధ్య దైవం బీరప్ప కామరాతి దేవాలయం జిల్లాలోనే అతిపెద్దది కావడంతో భక్తులు జిల్లా నలుమూలలతో పాటు పక్క రాష్ట్రాల నుండి విచ్చేసి స్వామివారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. కళ్యాణం అనంతరం ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా ఆలయ కమిటీ పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు భక్తులు పోటెత్తడంతో గ్రామంలోని ప్రతి ఎంత సందడి నెలకొనడంతో పండగ వాతావరణం కనిపించింది.

## గట్టుగూడెంలో లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం..



దమ్మపేట, సూర్య (మేజర్ న్యూస్ ) – ద్విచక్ర వాహనం పై వస్తున్న వ్యక్తి ని లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గట్టుగూడెం గ్రామ శివారులో సోమవారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్సైసాయి కిషోర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గట్టు గూడెం గ్రామానికి చెందిన దుగ్గిరాల సత్యనారాయణ (45) గున్నేపల్లి కి పని నిమిత్తం వెళ్లి తిరిగి గట్టుగుడంలోని మెట్ట ప్రాంతంలోని ఆయన నివాసానికి వెళుతుండగా సత్తుపల్లి వైపు వెళు తున్న రాజమండ్రి కి చెందిన బొగ్గు లారీ వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ. కొనటంతో ద్విచక్ర వాహనదారుడు దుగ్గిరాల సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే స్థానికుల సమాచారం మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ముష్టిబండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు




– పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే జారే..

దమ్మపేట, సూర్య (మేజర్ న్యూస్ ) – మండల పరిధిలోని ముష్టిబండ గ్రామంలో సోమవారం అశ్వరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన 51 కుటుంబాల సభ్యులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పార్టీ కండువాలు కప్పి సగర్వంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలు ఆకర్షితులైన పలు పార్టీలకు సంబంధించిన కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల ఆయన హర్షం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ తెలంగాణ ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. రానున్న కాలంలో ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ప్రభుత్వం ముందు సాగుతుందని పేర్కొన్నారు. పార్టీ జల చేరిన ప్రతి సభ్యుడికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్, సొసైటీ అధ్యక్షులు ఎల్లిన రాఘవరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రావు గంగాధర్ రావు, ఎఎంసి వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు,కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రావు పండు బాబు, తదితరులు పాల్గొన్నారు.



## మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే..



అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)– మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెంట్లం పంచాయతీలోని బీరప్ప కామరాతి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అబ్బుగూడెం గ్రామంలో పర్యటించి పాస్టర్ నాగభూషణం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన చర్చిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కేక్ కట్ చేసి క్రిస్టియన్ సోదరీ సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్టియన్ సోదరి సోదరులు ఎమ్మెల్యే కు శాలువా కప్పి సత్కరించారు. గ్రామంలో ఇటీవల నూతన వివాహమైన మిద్దె శివాజీ నవ దంపతులకు అక్షింతలేసి ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బండి ఆరాధనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట నాయకులు పర్సా వెంకటేశ్వరావు, చెరుకూరి రవి, మారకల లక్ష్మారెడ్డి, తిరుపతి రావు, శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు తదితరులు



పాల్గొన్నారు.



# శ్రీ కిరీటి ఆత్మహత్యకు కారణమైన విజిలెన్స్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- ఏబికేఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్**



కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్‌న్యూస్)- ఎస్.టి.పి.పి.లో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో ఎస్ఈ గా పనిచేసే శ్రీ కిరీటి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధకారం, దురదృష్టకరమని, ఏబికేఎంఎస్ కార్యదర్శి, మెంబర్ జేబి సిసిఐ పి. మాధవ నాయక్ అన్నారు. సోమవారం కొత్తగూడెం బిఎంఎస్ భవన్‌లో జరిగిన కార్పొరేట్ ఎస్ సిఎంకేఎస్, బిఎంఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాధవ నాయక్ పాల్గొని మాట్లాడుతూ విజిలెన్స్ డిపార్ట్మెంట్ అవినీతిపై వృత్తిపరమైన దర్యాప్తు చేయాలి కానీ అమాయక ఉద్యోగులను వేధించకూడదన్నారు. ఈ విషాదకరమైన సంఘటనలో కిరీటి ఆత్మహత్యకు ముందు వ్రాసిన లెటర్లు లో విజిలెన్స్ అధికారుల పేర్లు తెలియజేశారని, వాళ్ళ కారణంగానే వారు ఆత్మహత్య చేసుకున్నట్టుగా పేర్కొన్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. కావున ఆ లెటర్ ను మరణ వాంగ్మూలంగా పరిగణించి బాద్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.ఎస్టిపిపి స్టోర్లో మెటీరియల్ కొనుగోలులో , మెటీరియల్ డ్రా లో జరిగిన అవకతవకలు ఒక చిన్న అధికారి వలన జరిగేది కాదని, ఖచ్చితంగా దీని వెనకాల బాధ్యత కలిగినటువంటి ఉన్నతాధికారుల హస్తం కూడా ఉంటుందని ఆరోపించారు. కాబట్టి ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి ప్రభుత్వ దర్యాప్తు సంస్థల ద్వారా నిజానిజాలు బయటికి తెచ్చి కారకులైనటువంటి వాళ్లను కఠినంగా శిక్షించాలని బిఎంఎస్ యూనియన్ డిమాండ్ చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి టిఎస్ పవన్ కుమార్, కార్పొరేట్ ఉపాధ్యక్షులు జీవీ కృష్ణారెడ్డి, కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు మొగిలి పాక రవి, కార్పొరేట్ ఏరియా సెక్రటరీ ఉట్ల గణేష్ , యూనియన్ నాయకులు ఎం శ్రీనివాస్, రామ్ సింగ్, సుందర్ వెంకటేశ్వరరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**-ఎంపీటీసీ మడకం విజయ**

ములకలపల్లి,సూర్య (మేజర్ న్యూస్)- మండలపరిధిలోని ముత్యాలంపాడు జగన్నాధపురం నడుమ నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గంగారం ఎంపీటీసీ మడకం విజయ డిమాండ్ చేశారు. సోమవారం ఆమె స్థానిక నాయకులతోకలిసి వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. వంతెన నిర్మాణం నత్తనడకన సాగుతుందని, వర్షాకాలం సమీపిస్తున్న ఇంకా పిల్లర్స్ కూడా భూమి నుండి పైకి రాలేదని, ఇట్లయితే వానాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు తప్పవన్నారు. వంతెన నిర్మాణ పనుల్లో వాడుతున్న ఇసుక నాణ్యంగా లేదని, నిబంధనలు ప్రకారం గోదావరి ఇసుక వాడాల్సి ఉండగా,అందుకు విరుద్ధంగా నాణ్యత లేని వాగులోని ఇసుక ను వాడుతున్నారని ఆరోపించారు. ఈ విదంగా కడితే వంతెన ఎంతకాలం మన్నుతుందని ప్రశ్నించారు. సంబందిత అధికారులు పనులు దగ్గర ఉండి నాణ్యంగా చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు మడకం నరసింహారావు, మడకం రవి, విలేకరి ఈసం విజయ్, తదితరులు పాల్గొన్నారు.



## రాకేష్ రెడ్డి గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్న జడ్పిటిసి పోశం



మణుగూరు,సూర్య(మేజర్ న్యూస్)-నల్గొండ - ఖమ్మం - వరంగల్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వెయ్యాలని మణుగూరు జడ్పిటిసి పోశం సోమవారం మార్నింగ్ వాకర్స్ ని కలిసి అభ్యర్థించారు. మండలంలోని పివీ కాలనీ భద్రాద్రి స్టేడియం, అంబేద్కర్ పార్క్ లో మార్నింగ్ వర్కర్స్ తో అయన మాట్లాడుతూ రాకేష్ రెడ్డి ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవకై వచ్చిన త్యాగశీలి,సౌమ్యుడని రాకేష్ రెడ్డి మండలిలో ప్రవేశిస్తే గ్రాడ్యుయేట్స్ కు న్యాయం జరుగుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పై ఎన్నో ఆరోపణలు ఉన్నాయని అలాంటి వారికి అవకాశం ఇస్తే గ్రాడ్యుయేట్స్ కి అన్యాయం జరుగుతుందన్నారు.గ్రాడ్యుయేట్స్ అందరూ ఆలోచించి రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ ప్రచారంలో పాల్గొన్న బిఆర్ఎస్ మణుగూరు మండల అధ్యక్షులు ముత్యం బాబు, కూనవరం మాజీ సర్పంచ్ ఎనిక ప్రసాద్, మాజీ ఎంపీటీసీ వల్లభనేని రమణ, మణుగూరు టీబీజీకేఎస్ ఇంచార్జ్ నాగేల్లి వెంకట్, మణుగూరు మండల నాయకులు మడి వీరన్నబాబు, అక్కి నరసింహారావు, ఉప్పుతల రామారావు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ గురైనా బాలుడు...




అశ్వాపురం,సూర్య (మేజర్ న్యూస్)- అశ్వాపురం మండలం అమెర్ధ కాలనీకి చెందిన ఇరుగు నాగారాజు చిన్న కుమారుడు ఇంటి డాబాపైన ఆడుకుంటున్న సమయంలో 11కెవి విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్ కు గురైనాడు. హుటాహుటిన భద్రాచలం ప్రయివేటు హాస్పిటల్ కి తీసుకొని వెళ్ళి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బాలుడు ఆరోగ్య పరిస్తితి నిలకడగ ఉందని వైద్యులు తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, ఇళ్ళ పై కప్పుల అంచులను తాకుతూ ప్రసారం అవుతున్న 11 కెవి విద్యుత్ సరఫరాను మార్చాలని గతంలో అధికారులకు తెలియజేసిన పట్టించుకోలేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీని పై దృష్టి సారించి మా ప్రాణాలను కాపాడాలని బాధితులు కోరుకుంటున్నారు.

## దశదిన కర్మలకు హాజరైన ఎంపీపీ సుజాత



అశ్వాపురం,సూర్య(మేజర్ న్యూస్)- మండల కేంద్రంలో ముప్పారపు లక్ష్మయ్య దశదిన కర్మలకు ఎంపీపీ ముత్తినేని సుజాత హాజరై శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, మణుగూరు ఎంపిటిసి గడేపూడి కోటేశ్వరరావు,అశ్వాపురం మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్.కె ఖదీర్,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్న ఏడవల్లి కృష్ణ

పాల్వంచ,సూర్య(మేజర్‌న్యూస్ )- పట్టణపరిధిలోని కె ఎల్ అర్ కాలేజ్,మున్సిపాలిటీ ఆఫీస్‌లలో మిత్రపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం రాష్ట్ర నాయకులు ఏడవల్లి కృష్ణ సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏడవల్లి మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న ప్రజా సమస్యల మీద అనేక ఉద్యమాలు,అధికారులను సైతం నిలదీసి ప్రజలకు న్యాయం జరిగే వరకూ పోరాడిన నాయకుడన్నారు. ఆనాడు కెసిఅర్ ప్రభుత్వంలో కూడా వైఫల్యాలను ఎండగట్టడు ప్రజలవైపు నిలపడ్డాడు అధికారం వారి చేతుల్లో ఉండడం వలన మల్లను ప్రజల సమస్యల మీద పోరాటం చేస్తున్నాడని జైల్ కి కూడా పంపించారన్నారు. ముక్కు సూటిగా ప్రశ్నించే వ్యక్తి,నిరుద్యోగ యువత కి అసర గా ఉంటాడని, నిరుద్యోగుల కోసం ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా పోరాటం చేస్తాడని, గత ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి రెండవ స్థానంలో నిలిచాడన్నారు. యువత ఆలోచన చేసి అందరూ కూడా తీన్మార్ మల్లన్న కి హస్తం గుర్తుపై ఓటు ఓసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలోపాల్వంచ పట్టణ అద్యక్షులు నూకల రంగారావు, పాల్వంచ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గద్దల రమేష్ యూత్ నాయకులు చింత నాగరాజు,పాల్వంచ పట్టణ ఓబీసీ అద్యక్షులు బిఎన్ చారి,సాంబయ్య,తీన్మార్ మల్లన్న టీమ్ మహేష్ వర్మ,అద్దంకి బాబు తదితరులు పాల్గొన్నారు.



# విజయం పై గురి







### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో భాజపా అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం

**మధిర, సూర్య మేజర్ న్యూస్:** వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం ఉపఎన్నికపై భాజపా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. విజయమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. మండలిలో తమ బలం పెంచుకునేందుకు ఈ ఉపఎన్నికల్లో గెలిచి సత్తాచాటాలని భావిస్తోంది. పట్టభద్రులను తమ వైపునకు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఉద్యోగ, నిరుద్యోగ యువతకు.. కాంగ్రెస్, భారాసలు చేసిన మోసాలను వివరిస్తూ మండలిలో పట్టభద్రుల గళం వినిపించేందుకు భాజపాను గెలిపించాలని కమలదళం ఓట్లు అభ్యర్థిస్తోంది. ఈ నేపద్యంలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేంద్ర రెడ్డి ని అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, దేవకీ వాసుదేవరావు మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు జిల్లా మహిళా నాయకురాలు స్వర్ణకుమారి సోమవారం ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.న్యాయవాదులను, బ్యాంక్ ఎల్ఐసి పోస్టల్ ఉద్యోగులను,విద్య సంస్థల ప్రతినిధులను, వ్యాపార వర్గాలను కలసి, బీజేపీ అభ్యర్థి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇదే స్థానానికి ఎమ్మెల్సీగా అందరూ కలిసి గెలిపించిన బారాస పార్టీ అభ్యర్థి, మీ సమస్యలను కనీసం పట్టిచుకోకుండా పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవడం జరిగిందన్నారు. ఈసారి అలాంటి అభ్యర్థులకు అవకాశం ఇవ్వకుండా గుజ్జుల ప్రేమేంద్ర రెడ్డి ని గెలిపిస్తే మండలిలో పట్టభద్రుల సమస్యలపై పోరాటం చేస్తారని పట్టభద్రులందరూ మొదటి ప్రాధాన్యత ఓటును బిజెపి అభ్యర్థికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమం లో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళపల్లి విజయరాజు బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావుజిల్లా అధికారప్రతినిది రామిశెట్టి నాగేశ్వరావు మండల అధ్యక్షులు పాపట్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు

## 10 లక్షలు చెక్కు అందజేత

### పోస్ట్ ఆఫీస్ లో బీమాపాలసి తీసుకోండి

### సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్



**కల్లూరు,సూర్య మేజర్ న్యూస్::** పోస్ట్ ఆఫీస్ లో ప్రతి ఒక్కరు బీమా పాలసీ తీసుకొని కుటుంబానికి భరోసా కల్పించాలని సత్తుపల్లి సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ కె ప్రవీణ్ కుమార్ అన్నారు. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో శాంతినగర్ నందు కాకాటి ధనమ్మ కుటుంబ సభ్యులకు 10 లక్షల చెక్కును సత్తుపల్లి సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లూరు పోస్ట్ ఆఫీస్ నందు 399 రూపాయలతో కాకాటి ధనమ్మ టాటా పాలసీ తీసుకోవడం జరిగిందని తెలిపారు.ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆమెకు వచ్చిన ఇన్సూరెన్స్ నగదు ను నామిని అయిన ఆమె కుమారునికి పది లక్షల చెక్కు ను పోస్ట్ ఆఫీస్ నందు అందజేశారు. పోస్ట్ ఆఫీస్ నందు ప్రస్తుతం 520 రూపాయలుతో 10 లక్షలు ఇన్సూరెన్స్ ,720 రూపాయలకు 15 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యము ఉన్నదని తెలిపారు. ప్రతి ఒక్కరూ పోస్ట్ ఆఫీస్ నందు టాటా గాగ్ పాలసీ తీసుకోవడం మంచి భరోసానిస్తుందని తెలిపారు. ఎవరైనా ఈ పాలసీని తీసుకోవాలని అనుకున్నట్లయితే ఎక్కడైనా పోస్ట్ ఆఫీస్ నందు సంప్రదించి పాలసీ తీసుకోవాలని కోరారు.గతంలో 399 రూపాయలతో పాలసీ చేయడం వలన ఆ కుటుంబానికి 10 లక్షల రూపాయలు అందజేయడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్కినేని రఘు,ఎస్ పి ఎం ఎం.రామకృష్ణ,ఖమ్మంపాటి రాజా, రాజేంద్రప్రసాద్, సిబ్బంది తరితరులు పాల్గొన్నారు.

# హామీలను విస్మరించిన పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలి

**బి జే.పి ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలి**

**నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ కు తగిన బుద్ధి చెప్పాలి**

**మాజీ మంత్రి,బి.జే.పి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్**



ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్): ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్ కోరారు. సోమవారం శ్రీశ్రీ హొటల్లో బిజెపి జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో అనేక అమలు కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని పాతర వెయ్యాలని, ఆర్టీసీ కార్మికులకు ఇంతవరకు అపాయింట్మెంట్ డేట్ ను ప్రకటించలేదని, వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. మహిళలకు మహాలక్ష్మి పథకంలో ప్రకటించిన రూ.2,500 వెంటనే ఇవ్వాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్ఎస్, జర్నలిస్టుల హెల్త్ కార్డు పథకం అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, పిఆర్సి అమలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లు మంజూరు చేయాలన్నారు. నిబద్ధత అంకితభావంతో పనిచేసే బిజెపి పట్టభద్రుల అభ్యర్థి గుజ్జుల ప్రేమెందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి ఖమ్మం ఎంపీ తాంద్ర వినోద్ రావు బి.పి పాటిల్, సీనియర్ నాయకులు గెంటేల విద్యాసాగర్, నంబూరు రామ లింగేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శీలం పాపారావు, ఉప్పల శారద, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు సుభాష్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్ కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చావా కిరణ్, జిల్లా ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని గ్రామ దేవత లకు పూజలు

**కామేపల్లి సూర్య మేజర్ న్యూస్**



మండల కేంద్రమైన కామేపల్లి గ్రామ దేవతైన ముత్యాలమ్మ తల్లి దేవాలయ 10వ వార్షికోత్సవం సోమవారం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు ఈ సందర్భంగా కామేపల్లి పెద్ద చెరువు కట్ట దగ్గర ఉన్న గంగమ్మ తల్లి ఇతర దేవతలకు పూజలు నిర్వహించారు అనంతరం గ్రామంలో గల ముత్యాలమ్మ దేవాలయం లో అమ్మవారినీ పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు గ్రామం సుభిక్షంగా ఉండాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలని మొక్కలు చెల్లించారు ఈ కార్యక్రమంలో పూజారి సాంబశివరావు నిర్వాహకులు మహంకాళి రామ నర్సయ్య గుప్తా హనుమంతరావు కేశగానీనాగయ్య తిరుపతిరావు వెంకయ్య రాము తోట రాము గాదే సత్యం రమేష్ తదితరులు పాల్గొన్నారు

## న్యూ లిటిల్ ఫ్లవర్ కళాశాలకు ర్యాంకుల పంట

**జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు అభినందించిన కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు**




వైరా.సూర్యమేజర్ న్యూస్:నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు నిర్వహించిన బీ ఆర్క్ ప్లానింగ్ 2024 ఫలితాల్లో వైరాలో న్యూ లిటిల్ ఫ్లవర్ కళాశాలకు జాతీయస్థాయి ర్యాంకుల పంట పండింది. ఈ కళాశాలలో విద్యనుభ్యసించిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయిలో ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ఈ కళాశాలకు చెందిన కుర్ర స్వాత్య 1247 నందిగామ విక్రాంత 3350 చావా సాయి సుధీర్ 4095 వడ్డే శ్రీముఖి 10862 జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు మాట్లాడుతూ బీఆర్క్ పలితాలలో తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం వైరా కే గర్వకారణం అన్నారు. ప్రణాళికయు తమైన పటిష్టమైన అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం ఈ ఘన విజయానికి కారణమని చెప్పారు. ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ చూపడం వల్లనే ఇంతటి ఘన విజయాన్ని సాధించామని వివరించారు. భవిష్యత్తులో తమ కళాశాల విద్యార్థులు అన్ని రకాల పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు డైరెక్టర్లు కుర్ర సుమన్ కాపా డాక్టర్ మురళీకృష్ణ లగడపాటి ప్రభాకర్ రావు ప్రిన్సిపల్ షాజు మాథ్యూ ఏవో సామినేని నరసింహారావు ప్రత్యేకంగా అభినందించారు.

## విద్యుత్ వైర్లు తెగిపడి వరిగడ్డి వాము దగ్ధం

**కామేపల్లి సూర్య మేజర్ న్యూస్**



విద్యుత్ వైర్లు తెగి పడి వరిగడ్డి వాము దగ్ధమైన సంఘటన మద్రిగూడెం లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బత్తుల సుమన్ పాడి పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. గేదెల మేత నిమిత్తం రూపాయలు లక్ష ఖర్చు చేసి 1000 కట్టల వరిగడ్డిని నిల్వ చేశాడు. వరి గడ్డి వాము సమీపంలో విద్యుత్ తీగలపై కోతులు ఆటాడుతుండగా విద్యుత్ తీగల తెగి పడడంతో నిప్పురవ్వలు గడ్డివాము పై పడడంతో మంటలు చెలరేగి వాము దగ్ధమైంది. బాధితుడు సమాచారం మేరకు అగ్నిమాపక యంత్రం ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పింది. అప్పటికే గడ్డి కాలిపోయింది.

# రాయల సేవలు చిరస్మరణీయం







## నివాళులు అర్పించిన కేటీఆర్

తల్లాడ సూర్య మేజర్ న్యూస్ :- అనునిత్యం ప్రజలతో ఉంటు, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తూ ప్రాంత అభివృద్ధి కోసమే తుది శ్వాస విడిచే వరకు ఆలోచించిన నేత రాయల వెంకట శేషగిరిరావు అని మాజీ ఐటీ శాఖ మంత్రి భారాసా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ శేషగిరిరావు స్వగ్రామమైన మిట్టపల్లి గ్రామంలోని ఆయన నివాసానికి కేటీఆర్,రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి,మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్,రేగా కాంతారావు జిల్లా పార్టీ ప్రముఖులతో కలిసి రాయల నివాసంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్కు దశాబ్దాల కాలం పాటు పరిచయం ఉన్న నాయకుడు రాయల అని ఆయన గుర్తు చేశారు.తనకున్న పలు భాషల ప్రావీణ్యంతో ఎంతోమంది అధికారుల,నాయకుల మనసులో తన స్థానాన్ని పదిల పరుచుకున్న ప్రజానేత రాయల అని ఆయన అన్నారు. ఎంతో మంది ముఖ్యమంత్రుల చేత పేరు పెట్టి పిలిపించుకున్న రైతు నాయకుడు రాయల శేషగిరి అని అన్నారు.రాయల అను నిత్యం ఈ ప్రాంత అభివృద్ధి కోసమే ఆలోచించేవాడని ఆయన గుర్తు చేశారు.ఈ ప్రాంత ప్రజలకు,రాయల కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని,కార్యకర్తలు, అభిమానులు మనోధైర్యంతో ముందుకు నడవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో వారి వెంట పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# నేడు అమరజీవి కామ్రేడ్ మందడపు నాగేశ్వరరావు 3వ వర్ధంతి

**వర్ధంతి సభకు హాజరుకానున్న కొత్తగూడెం శాసనసభ్యులు కూనమనేని**
**సిపిఐ మండల కార్యదర్శి ఉట్ల కొండలరావు**




మధిర, సూర్య మేజర్ న్యూస్: నేడు మధిర మండలం మల్లారం గ్రామంలో జరిగే అమరజీవి కామ్రేడ్ మందడపు నాగేశ్వరరావు 3వ వర్ధంతికి పార్టీ శ్రేణులకు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని సిపిఐ మండల కార్యదర్శి ఉట్ల కొండలరావు పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి సభకు కొత్తగూడెం శాసనసభ్యులు సాంబశివరావు హాజరవుతున్నట్లు సోమవారం సిపిఐ కార్యాలయం నుంచి పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరజీవి కామ్రేడ్ మందడపు నాగేశ్వరరావు చదువుకునే రోజుల్లో విద్యార్థి నాయకుడిగా ఉద్యమాల ద్వారా రాజకీయ చైతన్యం పొంది సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుగా, ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులుగా, తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్)జిల్లా ప్రధాన కార్యదర్శిగా,మధిర మండల పరిధి మల్లారం ఎంపీటీసీగా కొనసాగుతున్న కామ్రేడ్ నాగేశ్వరరావు 2021 మే 21న కరోనాతో మృతి చెందారన్నారు.నమ్మిన సిద్ధాంతం కోసం 40 సంవత్సరాల పాటు ఎర్రజెండాయే శ్వాసగా ఆశగా జీవించాడని,తన తండ్రి రామయ్య పోరాట వారసత్వాన్ని కొనసాగించాడని అన్నారు.ఖమ్మం జిల్లా ప్రాంతంలో బలమైన ప్రజాఉద్యమాలు నిర్మించాడని,కార్మిక కర్షక, సమస్యలపై అలుపెరుగని పోరాటం నిర్వహించాడన్నారు.రాష్ట్ర,దేశవ్యాప్తంగా జరిగిన అనేక ప్రజా ఉద్యమ కార్యక్రమాల్లో తన వంతు పాత్ర పోషించాడని అన్నారు.ఈ నెల 21న మండల పరిధి మల్లవరం గ్రామంలో సాయంత్రం 5 గంటలకు జరిగే అమరజీవి కామ్రేడ్ మందడపు నాగేశ్వరరావు మూడో వర్ధంతి సభకి సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసన సభ్యులు కూనమనేని సాంబశివరావు,సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు,సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జిమ్ముల జితేందర్ రెడ్డి హాజరవుతున్నారని కార్మికులు,కర్షకులు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు,పార్టీ శ్రేణులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పణ

ప్రత్యేక పూజలు పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి



**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....**శ్రీ సత్యనారాయణ స్వామి కల్యాణ మహెూత్సవంలో సత్తుపల్లి శాసన సభ్యులు మట్టా రాగామయి దయానంద్ పాల్గొన్నారు. ఆదివారం రాత్రి పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం గ్రామంలోని శ్రీ సత్యనారాయణ స్వామి కల్యాణ మహెూత్సవ వేడుకలో పాల్గొని స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సోమరాజు సీతారామారావు,వంగా ఝాన్సీ, కావిటి శ్రీను, దొంతు మాధవరావు, పొట్లపల్లి వెంకటేశ్వరావు, బొర్రా కోటేశ్వరరావు, మిట్టపల్లి కిరణ్, వంగా నిరంజన్ గౌడ్, కావిటి శ్రీను, సతీష్ మండల కాంగ్రెస్ నాయకులు,గ్రామ నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

# చావా నరేంద్ర మృతి బాధాకరం

**బిజెపి జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ**

బోనకల్,(సూర్య మేజర్ న్యూస్): అనారోగ్యంతో మృతి చెందిన చావా నరేంద్రకు బిజెపి నాయకులు నివాళులర్పించారు. మండల పరిధిలోని కలకోట గ్రామానికి చెందిన చావా నరేంద్ర అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఖమ్మం జిల్లా బిజెపి అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, వరంగల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మారుతినేని ధర్మారావులు నరేంద్ర మృతదేహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన మరణం పట్ల విచారం వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు చావా కిరణ్, మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరావు ,జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు నాగేశ్వరరావు , బోనకల్ మాజీ ఉపసర్పంచ్ యార్లగడ్డ రాఘవరావు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి గంగుల నాగేశ్వరావు, ఆళ్ళపాడు మాజీ ఎంపీటీసి మందారాజ్యం, చావా రామారావు తదితరులు పాల్గొన్నారు



# బోనకల్ లో సంత కోసం ప్రయత్నాలేవీ..!?




**సంత లేక పక్క రాష్ట్రానికి తరలుతున్న గ్రామ పంచాయితీ ఆదాయం..!**
**సంత ఏర్పాటయితే రెండు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగమే**

బోనకల్, సూర్య (మేజర్ న్యూస్): రాజకీయ చైతన్యం, విద్యాధికులతో పాటు ఆర్థిక వనరుల అభివృద్ధికి సహకరించే ప్రజాప్రతినిధులు తమ చుట్టూ ఉన్నప్పటికీ మండల కేంద్రంలో అన్ని విధాల ఆదాయం సమకూర్చే సంత ఏర్పాట్లకోసం స్థానిక ప్రజాప్రతినిధులు ఎటువంటి ప్రయత్నాలు చేయకపోవడం ఒకింత దురదృష్టకరం. ఈ ప్రయత్న లోపాల కారణంగా బోనకల్ గ్రామ పంచాయితీ లక్షల రూపాయల ఆదాయాన్ని కోల్పోవడమే గాక ఊహించని ఆర్థిక నష్టాన్ని చవిచూస్తుంది. నియోజకవర్గ రైతులు, దళారులు, మండల ప్రజలు వ్యవసాయ, ఇతర అవసరాల నిమిత్తం స్థానికంగా సంత లేకపోవడంతో కొంత కష్టమైనప్పటికీ సంతకు వెళ్లే క్రమంలో పక్క రాష్ట్రమైన ఆంధ్రాకి వెళ్లి అవసరమైన అమ్మకాలు కొనుగోలు జరుపుతున్నారు. స్థానికంగా సంత ఏర్పాట్లు లేకపోవడంతో పక్క రాష్ట్రానికి తరలి వెళ్లి అక్కడ సంతలో చేసే అమ్మకాలు, కొనుగోళ్ల ద్వారా స్థానిక గ్రామ పంచాయతీకి రావాలసిన లక్షల రూపాయల ఆదాయం ప్రక్క ప్రాంతాలకు తరలి వెళుతుంది. మండల కేంద్రంలో సంత ఏర్పాటు చేయడానికి అన్ని వసతులు ఉన్నప్పటికీ నేటి వరకు ఆ ఊసే లేదు. అయితే గడచిన 2020 సంవత్సరంలో స్థానిక పంచాయతీ పాలకవర్గ సభ్యులు సంత ఏర్పాటుకు ప్రయత్నాలు చేసినప్పటికీ అది సఫలీకృతం కాలేదు. ఆ తర్వాత ఆ దిశగా ప్రయత్నాలు కూడా కొనసాగలేదు. సంత ఏర్పాటుకోసం ప్రయత్నాలు జరిగి అది కార్యరూపం దాల్చితే నియోజక వర్గంలోని ఐదు మండలాల ప్రజలకు, అదేవిధంగా ఆంధ్ర ప్రాంతంలోని వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల ప్రజలు కూడా అమ్మకాలు, కొనుగోళ్ల నిమిత్తం బోనకల్ సంతకు తరలి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.ఖమ్మం వైరా, మధిర, జగ్గయ్యపేటలకి బోనకల్ కేంద్రబిందువుగా వుండటంతో ఆయా ప్రాంతాలలోని అధిక శాతం ప్రజలు వ్యాపార లావాదేవీల నిమిత్తం ఈ సంతకు వచ్చే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. తద్వారా గ్రామ పంచాయతీకి ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరి స్వయం సమృద్ధి కి బాటలు వేయవచ్చని మండల ప్రజలు భావిస్తున్నారు. సంత ఏర్పాటయితే కొందరికి జీవనోపాధి దొరికే అవకాశం ఉంది. సంత ఏర్పాటుకి ప్రయత్నాలు జరిగి, అది కాస్తా సఫలీకృతమయితే బోనకల్ గ్రామపంచాయతీ తోపాటు మండల ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిదులు ఆ దిశగా ప్రయత్నాలు చేసి, పంచాయితీ అభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని ఆశిద్దాం.

## 220 కెవి విద్యుత్ ఉపకేంద్రంలో సాంకేతిక లోపం

### దగ్ధమైన విద్యుత్ సరఫరా పరికరం

### విద్యుత్ పునరుద్ధరించిన ట్రాన్స్ కో

**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....**పెనుబల్లి మండలంలోని 220 కెవి విద్యుత్ ఉపకేంద్రంలో సాంకేతిక లోపం ఏర్పడింది. పెనుబల్లి మండలంలోని టేకులపల్లి విద్యుత్ ఉప కేంద్రంలో సోమవారం సాంకేతిక లోపం ఏర్పడి విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడింది. టేకులపల్లి 220 కెవి విద్యుత్ ఉపకేంద్రంలో అధిక పీడనం కారణంగా విద్యుత్ సరఫరా పరికరం మంటలు వ్యాపించి దగ్ధమవడంతో పెనుబల్లి, కల్లూరు మండలాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. గాలులు, ఉరుములు, మెరుపులతో ఇప్పుడు నా వర్షాల వలన సహజంగానే విద్యుత్ సరఫరా పరికరాల సాంకేతిక లోపాలు ఏర్పడతాయని ఈ రెండు మండలాల్లో వినియోగదారులకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడకుండా ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సమన్వయం పరిచి విద్యుత్ పునరుద్ధరించామని ట్రాన్స్ కో ఏఈ తెలిపారు.



## పిడుగు పాటుకు దుక్కిటెద్దు ఆవు మృతి

### వీటి విలువ సుమారుగా 1లక్షా 60 వేలు వుండిందని అంచనా



కల్లూరు సూర్య మేజర్ న్యూస్ మే (20) : మండల పరిధిలోని పెద్దకొరుకోండి, గ్రామానికి చెందిన వినుకొండ దానియేలు అనే పేద రైతు, వ్యవసాయ నిమిత్తము దుక్కిటెద్దును సుమారుగా రూ,90 వేల రూపాయలు విలువ సేసే ఎద్దును కొనుగోలు చేయడం జరిగిందని,అందులో భాగంగా, గత పది రోజుల కిందట ఈ ఎద్దును విక్రయించడం జరిగింది. ఇంటికి ఎద్దు రాకపోవడంతో దానియేలు వెదకడం మొదలు పెట్టారని ఆయన వాపోయారు. నిన్న కురిసిన అకాల వర్షం వల్ల వెన్నవల్లి శివారులో గల బావన్న నారాయణ మామిడి తోటలో విగత జీవిగా పడి ఉండటం కొందరు వ్యక్తులు చూసి దానియేలు కు సమాచారం అందజేశారు. ఫోటోఫూట్నా దానియేలు ఘటన స్థలాన్ని చేరుకొని గుండె బాదుకుని స్పృహ కోల్పోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఎద్దు వద్దకు వచ్చి పరసిలిస్తున్నారు. ప్రభుత్వము బాధిత పేద కూలికి కు న్యాయం చేస్తారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా రావికం పాడు గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఆవు కూడా పిడుగు పాటుకు మృతి చెందింది.అనంతరం మండల పశువైద్యాధికారి , చెన్నూరు ఇంచార్జ్ పశువైద్యాధికారి మమత ఘటన స్థలాన్ని చేరుకొని ఆ పశువులు రెంటిని కూడా పరిశీలించడం జరిగింది . ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి మమత బాధితులు బీరెల్లి దానియేలు, రావికంపాడు గ్రామ పశు రైతు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారు.

## ఘనంగా జూ. ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

### ఆసుపత్రిలో రోగులకు పళ్లు, బ్రేడ్ లు పంపిణి



పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను పెనుబల్లి మండలం ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జూ : మండలంలోని జూ ఎన్టీఆర్ అభిమానులు భారీగా తరలివచ్చి పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో కేట్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. వీ.ఎం.బంజర్ బస్టాండ్ లో ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు, స్వీట్స్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అభిమానులు మాట్లాడుతూ జూ ఎన్టిఆర్ తాత దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆశయాలను ఎన్టీఆర్ కొనసాగించాలని కోరుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## జీలుగు పచ్చిరొట్ట విత్తనాలను రైతులు కందుబాటులో ఉంచాము : ఉమామహేశ్వర్ రెడ్డి

### జీలుగు విత్తనాలను రైతులకు అందజేస్తున్న వ్యవసాయ శాఖ అధికారి..



సింగరేణి సూర్య మేజర్ న్యూస్

సింగరేణి(కారేపల్లి మే20)తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయదారులు ఏరువాక సాగే సమయం దగ్గర పడుతుండటంతో,ఇప్పటికే వర్షాలు పడుతుండటంతో దుక్కులు దున్నుకొని పచ్చ రొట్ట విత్తనాలను వాడాలని ఆయన సూచించారు. వ్యవసాయ రంగానికి కొన్ని విత్తనాలను రాయితీ ప్రకటించి,వ్యవసాయం చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలను సరఫరా చేస్తుందని,ప్రభుత్వం ఏ విత్తనాలు ఇచ్చిన రైతులకు అందుబాటులో ఉంచుతామని వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డి తెలిపారు.రాయితీలో పచ్చిరొట్ట విత్తనాలు,వ్యవసాయ శాఖ ద్వారా 60శాతం రాయితీపై వచ్చినట్ట విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచి అందజేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర్ రెడ్డి తెలియజేయడం జరిగింది.స్థానిక కారేపల్లి సొసైటీ నందు ఎనిమిది వందల బ్యాగులు అనగా 28 టన్నుల జిలుగులు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వరి,మిరప రైతులు దుక్కిలో ముందగా వ విత్తనాలు చల్లి పచ్చిరొట్ట ఎరువులను పెంచి వాటిని భూమిలో కలియ దున్నటంవలన భూసారం,పెరుగుతుందని తద్వారా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని తెలియజేయడం జరిగింది.కావున మండల రైతులందరూ కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో హనుమంతురావు,సొసైటీ సిబ్బంది వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కోవర్ట్ తాతా మధు...

### తాతా మధు తీరుతోనే వైరాలో ఓటమి

### పార్టీ వ్యతిరేకులను సస్పెండ్ చేయాలి

సింగరేణి సూర్య మేజర్ న్యూస్ సింగరేణి(కారేపల్లి మే20)కాంగ్రెస్ కోవర్ట్‌గా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధు పని చేస్తున్నాడని మాజీ దిశకమిటీ సభ్యులు లాకావత్ లక్ష్మన్,మాజీ సర్పంచ్ గుగులోత్ సక్రులు ఆరోపించారు. సోమవారం సింగరేణిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...ఆసెంబ్లీ ఎన్నికలలో తాను కోరుకున్న వ్యక్తి వైరా అభ్యర్థి కాలేదనే అక్కసుతో బానోత్ మదన్‌లాల్ ఓటమికి తీవ్ర కృషి చేశారన్నారు.మదన్‌లాల్‌కు ఓటు వేయవద్దని మధు తన ముఠా నాయకులతో గ్రామ శాఖ అధ్యక్షులకు ఫోన్ చేయించారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ పంపిన పైకాన్ని కారేపల్లి మండలానికి రాకుండా తాతా మధు అడ్డుకున్నారన్నారు.బూత్ కమిటీ ఖర్చుల పైకాన్ని ఎంపీపీ శంకుతల,మాజీ సర్పంచ్‌లు కిషోర్,బానోత్ కుమార్ లు కామేపల్లిలో దాచి కార్యకర్తలకు అగ్రహానికి గురైన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.బీఆర్ఎస్‌ను వీడిన మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ వెంటే ఉంటామని రహస్య మీటింగ్‌లు పెట్టుకున్నారని మండల ప్రజలు వీరి నాటకాన్ని గమనిస్తున్నారన్నారు.పార్టీకి విధేయుడిగా ఉన్న బానోత్ మదన్‌లాల్ పైనే అసత్యప్రచారాలు చేయిస్తూ కార్యకర్తలను గందరగోళంకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు, కేసీఆర్ ఆలోచన విధానాన్ని ఏనాడు వివరించలేదన్నారు.వైరా నియోజవర్గంలో కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీ జెండాను మోస్తూ కార్యక్రమాలను విజయవంతం చేసిన చరిత్ర బానోత్ మదన్‌లాల్ దన్నారు.జిల్లాలో బీఆర్ఎస్ మనుగడకు ప్రమాదకరంగా మారిన జిల్లా అధ్యక్షులుగా తాతా మధును తొలగించటంతో పాటు పార్టీ నుండి సస్పెండ్ చేయాలని పార్టీ పెద్దలను కోరారు.ఈకార్యక్రమంలో నాయకులు మూతి కోటేశ్వరరావు,గుగులోత్ జుంకీలాల్,భూక్యా కోటేశ్వరరావు, దారావత్ వికాస్,భూక్యా మధు, గంగరబోయిన మురళి తదితరులు ఉన్నారు.



## భగవద్గీత కంఠస్త పోటీల్లో గోల్డ్ మెడల్ అందుకున్న రజని, సునీత

**వైరా.సూర్యమేజర్ న్యూస్:ఋ**

వైరాకు చెందిన రాయ పుడి రజని సునీత వేముల ఫణి అనుమోలు కృష్ణ వేణి లకు భగవద్గీత కంఠస్థ పోటిల్లో గోల్డ్ మెడల్ వరించింది. కర్ణాటక రాష్ట్ర%శీ% మైసూర్ లోని గణపతి సచ్చిదానంద ధత్తపీఠం ఆశ్రమం వారు ప్రపంచం వ్యాప్తంగా నిర్వహించిన భగవద్గీత కంఠస్థ ఆన్లైన్ టెలిగ్రామ్ ప్రోగ్రాం పోటీల నిర్వహణ లో 18 అధ్యాలనుండి 25 నిమిషాలలో వారు అడిగిన 150 శ్లోకాలు ఉచ్చారణ దోషాలు లేకుండా కళ్ళుమూసుకొని ఏ అధ్యయనం అడిగిన దారాళముగా భగవద్గీత లోని శ్లోకాలను కంఠస్తముతో చెప్పడంలో గోల్డుమెడల్ సాధించారు. ఈ పోటిల్లో 810 మంది వివిధ దేశాల, రాష్ట్రాల నుండి పాల్గొన్నారు. భగవద్గీతలోని శ్లోకాలను ఎక్కడ అడిగిన తడబడకుండా దారాళముగా చెప్పి విజయానికి కారణం అయ్యారు. 25 నిముషాలలోనే 18 శ్లోకాలను ఆన్లైన్ లో అడిగిన ప్రతి దానికి కళ్ళుమూసుకొని సమాధానం చెప్పడం అంటే సామాన్యమైన విషయం కాదు. కర్ణాటక లోని మైసూర్ లో గోల్డుమెడల్ అందు కున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాకు శిక్షణ లో నేర్పిన భగవద్గీత పాటలు ప్రారంభం లో నోరు తిరగక చాలా ఇబ్బంది అనిపించింది. ఒకటికి నాలుగు సార్లు పాటలు వినుకుంటు ప్రయత్నం ఆపకుండా ఎలాగైనా గోల్డుమెడల్ సాధించాలని పట్టుదలతో, భక్తి శ్రద్దలతో నేర్చుకున్నామని అన్నారు. భగవద్గీత కంఠస్త పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన రాయపూడి రజిని దోనేపూడి సునీత అనుమోలు కృష్ణవేణి వేముల ఫణి కుమారి లను గీతా పారాయణం నిర్వాహకురాలు కొప్పురావు ఝాన్సీరాణి సభ్యులు మిట్టపల్లి మంజుల మిట్టపల్లి పద్మజ రంగా సుశీల నాగు బండి పద్మజ రాయల విజయ లక్ష్మి శ్రీదేవి సరోజిని కల్పన శ్రీలక్ష్మి రాఘవమ్మ నీలిమ కస్తూరి కళావతి ప్రసన్న తదితరులు అభినందనలు తెలియజేశారు.



# అర్హులందరికీ ఇళ్లు, రేషన్ కార్డులు అందజేస్తాం

**సంక్షేమ పథకాల అమలులో రాజీ పడం**
**తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తాం**
**పాలేరు నియోజకవర్గ ప్రజల రుణ%శీ% తీర్చుకుంటా**
**రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి**
**రెండో రోజు ముమ్మరంగా కొనసాగిన**
**ప్రజల చెంతకే.. మీ శీనన్న కార్యక్రమం**







**ఖమ్మం, సూర్య బ్యూరో..**

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ పక్కా ఇళ్లను మంజూరు చేస్తామని, తెల్ల రేషన్ కార్డులు అందజేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల చెంతకే.. మీ శీనన్న కార్యక్రమంలో భాగంగా సోమవారం నేలకొండపల్లి మండలంలోని గువ్వల గూడెం, ముజ్జు గూడెం, అనాసాగరం, సదాశివపురం, పాత కొత్తూరు, నాచేపల్లి గ్రామాల్లో ప్రజలతో సమావేశమై.. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. మహిళలు, రైతులు, గ్రామ ప్రజా ప్రతినిధులతో మాట్లాడి.. ప్రధానంగా చేపట్టాల్సిన పనుల వివరాలు తెలుసుకున్నారు. గత బీఆర్ఎస్ పాలనలో కక్షపూరితంగా చాలా పనులు ఆపేశారని, ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాల అవసరం ఉందని ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన స్పందించి.. ఎన్నికల కోడ్ ముగిశాక ఆయా పనుల నిర్వహణకు సత్వర చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజల చల్లని దీవెనలతో అసెంబ్లీ ఎన్నికల్లో మంచి విజయాన్ని అందించారని, రాష్ట్ర మంత్రిని అయ్యానని, పాలేరు నియోజకవర్గం తనకు సొంతూరు లాంటిదని.. అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి రుణం తీర్చుకుంటానని అన్నారు.

**నీటి ఎద్దడి రానీయం..**

నియోజకవర్గంలో యుద్ధ ప్రాతిపదికన నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపడతామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య రానీయకుండా.. పనులు చేయిస్తామని తెలిపారు. ప్రజలకు సత్వర సేవ చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని, ప్రభుత్వ పథకాల అమలులో రాజీ పడకుండా ముందుకెళతామని తెలిపారు.

**గత ప్రభుత్వంలో లాగా కాకుండా పేదలందరికీ ఇందిరమ్మ గృహాలు**

బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల గూడు.. గోడును పట్టించుకోలేదని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రస్తుత ఇందిరమ్మ రాజ్యంలో.. పైరవీలకు తావు లేకుండా అర్హులందరికీ గృహాలు కట్టిస్తామని అభయమిచ్చారు. ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని, పట్టాలు అందజేస్తామని తెలిపారు.రాబోయే మూడు సంవత్సరాల్లో పాలేరు నియోజకవర్గంలో పేదలంతా పక్కా ఇళ్లలో ఉండాలనేదే తన లక్ష్యమని తెలిపారు.

**ప్రతి ఊరిలోనూ పథకాల ఫలాలు కనిపిస్తాయి..**

సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, ఎన్నికల కోడ్ ముగిశాక అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని చెప్పారు.

**ప్రజలే నా బలం..**

తాను ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటానని, వారే తన బలమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.ఎన్నికలు, ఉన్నా లేకపోయినా.. జనం బాగోగులు తెలుసుకుంటానని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాదిరిగా కక్షపూరిత రాజకీయాలు ఉండవని అన్నారు.

# లోక్ సభ సాధారణ ఎన్నికల ఓట్లు లెక్కింపు కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



**రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్**




ఖమ్మం, సూర్య బ్యూరో మే 20: లోకసభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఖమ్మం పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం నూతన కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నోడల్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో లోకసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోకసభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. లెక్కింపు విధుల సిబ్బందికి ఈ నెల 29న మొదటి విడత, జూన్ 2 న రెండో విడత శిక్షణకు ఏర్పాట్లు చేయాలన్నారు. సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలకునిచే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు కు అవసరమయ్యే సామాగ్రి సిద్ధం చేసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద తహశీల్దార్లను బాధ్యులుగా పెట్టాలన్నారు. లెక్కింపు పిదప ఇవిఎం యంత్రాలను గోడౌన్ కు తరలింపుకు డిజిటి వాహనాలు సిద్ధంగా ఉంచాలన్నారు. లెక్కింపు కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్, సిసి కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ రూం ఫర్నిచర్, మీడియా సెంటర్ షామియాన, ఫర్నీచర్ ఏర్పాట్లు చేయాలన్నారు. క్లోక్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ మధ్యాహ్నం 12.30 గంటల లోపు పూర్తి అయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. ఇవిఎం క్యారీయింగ్ స్టాఫ్ నియామకం చేయాలన్నారు. ఇవిఎం ల తరలింపుకు హమాలీల ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిమిత్తం 40 లోకేషన్లలో 115 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు, అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస మౌళిక సదుపాయాల కల్పన చేయాలన్నారు. 40 లోకేషన్లలో వైద్య శిబిరాల ఏర్పాటు చేయాలన్నారు. కావాల్సిన పోలింగ్ సిబ్బంది, సెక్టార్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ నియామకం చేసినట్లు, రూట్ మ్యాపులు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 21 న మొదటి విడత, 26న రెండో విడత శిక్షణ కార్యక్రమాల ఏర్పాట్లు చేయాలన్నారు. శిక్షణ లో జంబో బాక్స్, గోద్రెజ్ బాక్స్ సీలింగ్, ఫారాల పూరణపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. బ్యాలెట్ బాక్సుల మరమ్మతులు పూర్తి చేశామన్నారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. అధికారులు నియమ నిబంధనలను పాటిస్తూ, ఏ దశలో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకుండా జీరో ఎర్రర్ తో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమీక్ష లో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, జిల్లా ఉపాధికల్పన అధికారి శ్రీరామ్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి. మాలతి, జిల్లా పరిశ్రమల అధికారి అజయ్ కుమార్, పిఆర్ ఎస్ఇ చంద్రమౌళి, ఆర్టీవో ఆఫ్రీన్ సిద్దిఖీ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, డిపిఓ హరికిషన్, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో అరుణ,కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మదన్ గోపాల్, మీనన్, సత్యనారాయణ, రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాకేష్ రెడ్డి ని గెలిపించండి.



**సూర్య ప్రతినిధి ఖమ్మం**

శాసనమండలికి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా విద్యావంతులు, ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఖమ్మం ఎస్బిఐకళాశాల ప్రాంగణంలో సోమవారం జరిగిన సభలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారరామారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు సభలో మాజీ మంత్రి, %మీూూ% కేటిఆర్ కామెంట్స్
శాసనసభలో లోక్ సభలో ప్రభుత్వాలు ఏకపక్ష ధోరణి అవలంబిస్తే ప్రజాస్వామ్యాన్ని సమతుల్యంగా ఉంచేందుకు శాసనమండలి ఏర్పాటు చేశారు. పట్టభద్రుల తరఫున, తెలంగాణ నిరుద్యోగుల తరఫున పోరాడేందుకు ఏ విధంగా ఉండాలి మీరే నిర్ణయించుకోండి.మీరు పట్టం కట్టే వ్యక్తి బ్లాక్మెయిల్ రాజకీయాలు, బూతు పురాణం మాట్లాడే వ్యక్తి ఉండాలా మీరే నిర్ణయించుకొండి.రాజేష్ రెడ్డి ఒక రైతు కుటుంబం నుండి వచ్చి అందరికీ తన వంతు సహకారం అందిస్తూ స్వతహాగా ఎదిగిన వ్యక్తి. అమెరికాలో ఫేస్బుక్ లాంటి పెద్ద కంపెనీల్లో పని చేసిన వ్యక్తి.

మనకోసం మనకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చాడు.బిఆర్ఎస్ తరఫున గోల్డ్ మెడల్ సాధించిన వ్యక్తి ఉంటే, కాంగ్రెస్ పార్టీ తరఫున బ్లాక్ మెయిలర్ బూతులు మాట్లాడే వ్యక్తి జైలుకు వెళ్లిన వ్యక్తి ఉన్నాడు.ఆడపిల్లల గౌరవాలకు భంగం కలిగేలా చండాలం పని చేసిన వ్యక్తి పట్టభద్రులకు వెళ్లకూడదు.. ఆలోచించుకోండి.ప్రశ్నించే గొంతు శాసనమండలిలో ఉండాలి.కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పే ప్రయత్నం చేస్తుంది.

మాజీమంత్రి పువ్వాడ కష్టపడి ఐదేళ్లు పనిచేశాడు దురదృష్టవశాత్తు ఆయన ఈ ఎన్నికల్లో ఓడిపోయారు.ప్రభుత్వం ఇస్తా అన్న నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాల గురించి పోరాడతారు.సమాజంలో మంచికంటే చెడు ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. సోషల్ మీడియాలో మంచి మాటలు చెప్పే రాకేష్ రెడ్డి లాంటి వ్యక్తి మాటలు ఎవరు చూడరు, తీన్మార్ మల్లన్న లాంటి వ్యక్తి బూతులు మాట్లాడితే ఎక్కువ మంది చూస్తారు.

ఖమ్మం నగరం గత పదేళ్లలో సర్వాంగ సుందరంగా మారింది. 9 ఏళ్లలో మనం ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని ప్రచారం చేస్తున్నారు, దేశంలో అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం తెలంగాణ.నేను రాహుల్ గాంధీ, బిజెపి నాయకులను పప్రశ్నిస్తున్న.. మేము ఇచ్చినన్ని ఉద్యోగాలు ఏ రాష్ట్రమైనా ఇచ్చిందా, ఇస్తే చూపించండి అని.రేవంత్ రెడ్డి వచ్చిన దగ్గరి నుండి ఒక్క నోటిఫికేషన్ అయిన ఇచ్చాడా.రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి.మనం వరంగల్ ఖమ్మం సాఫ్ట్వేర్ కంపెనీలు తీసుకొచ్చాం, వరంగల్ కు టెక్ మహీంద్రా వంటి కంపెనీలు వస్తే రేవంత్ రెడ్డి వచ్చాక అవి తిరిగి వెళ్ళిపోతున్నాయి..2014లో మనం వచ్చేనాటికి తెలంగాణలో ఐటి విలువ 55వేల కోట్లు, మన ప్రభుత్వం దిగిపోయే నాటికి ఐటీ విలువ 2 లక్షల కోట్లు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్లగొండ ప్రాంతాలు పోరాటాలకు, మేధావులు ఎక్కువగా ఉండే ప్రాంతాలు.పార్టీలు ఏవైనా పట్టభద్రులు అంతా మంచి వ్యక్తులను మండలికి పంపించారు.మండలి అంటే పెద్దల సభ, ఇక్కడ మేధావులను ఎన్నుకుంటారే తప్పా, మోసగాళ్లను ఎన్నుకోరు.కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలతో అధికారంలోకి వచ్చింది.రెండు పర్యాయాలు పాటు బీఆర్ఎస్ కు అవకాశం ఇచ్చాం, కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశం ఇస్తే ఇంతవరకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు.కాంగ్రెస్ పార్టీ జాబ్ క్యాలెండర్ ఇస్తా అని ఇవ్వలేదు, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తా అని ఇవ్వలేదు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నన్ను గెలిపిస్తే ప్రజల తరఫున పోరాడతా, ప్రభుత్వం మెడలు వంచి రాష్ట్రానికి మంచి చేస్తా.కాంగ్రెస్ అభ్యర్థి తనని తాను ప్రశ్నించే గొంతుకుగా చెప్పుకుంటారు, ఈ 5 నెలల్లో ఏ రోజైనా ప్రశ్నించాడా, విద్యావంతులు గమనించాలి.నేను రైతు కుటుంబం నుండి వచ్చాను, నా దేశం నా రాష్ట్రం మీద ఉన్న ప్రేమతో రాజకీయాల్లోకి వచ్చా.బీజేపీ లో చాలా ఏళ్లు పని చేశా, ఎన్నో పోరాటాలు చేశా, కేసిఆర్ నన్ను పిలిచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారు.



# సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఖమ్మం, సూర్య ప్రతినిధి మే 20:**

జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుండి జూన్ 3 వరకు జరుగుతాయని, వీటి నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని, ప్రశాంత వాతావరణంలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు విజయవంతంగా నిర్వహించాలని జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి అన్నారు. సోమవారం జిల్లా రెవిన్యూ అధికారిణి కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ చాంబర్ లో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో మొత్తం 42 సెంటర్లలో ఉదయం, సాయంత్రం పరీక్షలు జరుగుతాయని, ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2-30 గంటల నుండి సాయంత్రం 5-30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం 10352 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం 4632 మంది విద్యార్థులు హాజరవుతారని, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించుటకు జిల్లా పరీక్షల కమిటీ ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ లను నియమించడం జరిగిందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ పరీక్ష నిర్వహణలో



పాల్గొంటారని, ప్రతి సెంటర్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. సీసీ కెమెరా నిఘాలో పరీక్ష ప్రశ్నాపత్రాలు తెరువాలని, ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అన్ని సెంటర్లలో మంచినీటి సౌకర్యం, నిరంతర విద్యుత్తు, వైద్య సదుపాయాలు కల్పించాలని, షెడ్యూల్ ప్రకారం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆమె అన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ వినోద్ జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి రవిబాబు, ఉప జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. సైదులు, డీఈ టిజి ఎన్పిడిసిఎల్ బాబూరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 200 గొర్రెలు చనిపోయి నష్టపోయిన గొర్రెల పెంపకం

## -దారుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలి

## - డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ డిమాండ్

**కామేపల్లి సూర్య మేజర్ న్యూస్**

నాలుగు రోజులు క్రింద కలుపు మందు చల్లిన చేనులో మేత కోసం వెళ్ళిన 200 గొర్రెలు తిని మృత్యువాత పడ్డాయని, దాదాపు 30 లక్షల రూపాయలు విలువగల జీవాలు కోల్పోయి కేవలం గొర్రెలవృత్తిపై



ఆధారపడి జీవించే కుటుంబాలు, వీధిలో పడ్డాయని, ప్రభుత్వం వెంటనే అత్యవసర ఆర్థిక సాయం ప్రకటించి, ఎక్స్గ్రేషియా మంజూరు చేయాలని డిసిసిబి డైరెక్టర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్ డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ల సమక్షంలో పత్రిక విలేకరుల సమావేశంలో మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ నాలుగు రోజుల క్రిందట తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామంలో కేవలం గొర్రెల పెంపకం వృత్తిపైనే ఆధారపడి జీవించే కుటుంబాలు చాలా ఉన్నాయని, పది రోజుల కింద పెసర చేనుకు కలుపు మందు కొట్టిన సంగతి తెలియక గొర్రెల మేయడం వలన 200 గొర్రెలు మృత్యువాత పడి, 300 గొర్రెలు అస్వస్థకు గురయ్యాయని, ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టి,రాష్ట్ర డిప్యూటీ సి ఎం మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ల దృష్టికి తీసుకువెళ్లి పరిహారం వచ్చే విధంగా ఒత్తిడి తీసుకువచ్చి గొర్రెలు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని మల్లి బాబు యాదవ్ హామీ ఇచ్చారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు ప్రతి గొర్రెకు ప్రభుత్వం ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించే వారిని, ఆ పథకం అమల్లో ఉన్నట్లయితే గొర్రెల పెంపకం దారుల జీవితాల్లో వెలుగులుగా ఉండేవని, ఆ పథకాన్ని మళ్లీ పునరుద్ధరించి ప్రతి గొర్రెకు ఉచితంగా బీమా సౌకర్యం కల్పించాలని మల్లిబాబు యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్లు జనగం కోటేశ్వరరావు, అయిలూరి వెంకటేశ్వర రెడ్డి, నూకల సైదులు, చల్లగుండ కృష్ణయ్య, నిమ్మల పుల్లారావు, బోబోలా లక్ష్మణరావు, పుల్లారావు, కోరం జానకిరామ్ పాల్గొన్నారు.

# కేంద్రం లో బిజెపి ప్రభుత్వంనిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైంది

**– సీపీఐఎంఎల్ మాస్ లైన్ జాతీయ నాయకులు జిల్లా కార్యదర్శి గోగినపల్లి వెంకటేశ్వర్లు విమర్శించారు**

**వైరాసూర్యమేజర్ న్యూస్ః-**

ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ కేంద్రం అమరవీరుల నగర్ లో పార్టీ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ. మత పాసిస్టు రాజ్య స్థాపన కోసంప్రధాని మోదీ దిగజారి మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులు మూడోసారి అధికారంలోకి రావడానికి దిగజారిన పద్ధతుల్లో ప్రయత్నిస్తున్నాయనివిమర్శించారు. అలాంటి ప్రధానిని మళ్లీ అధికారంలోకిరాకుండా ఓడించి లౌకిక ప్రజాస్వామిక దేశ భక్తి కలిగిన శక్తులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలో పౌరులకు కల్పించిన రిజర్వేషన్లు మారుస్తామని బహిరంగంగానేప్రకటించటాన్ని తీవ్రంగా ఖండించారు. రిజర్వేషన్ల రద్దు






ప్రకటనల తో ప్రజావ్యతిరేకత వ్యక్తం కాగానే ప్రధాని మోదీ, హొంమంత్రి అమితా ప్లేటు ఫిరాయించారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌర హక్కులను కాపాడుకొనేందుకుబీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు.. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.అర్జున్ రావు అధ్యక్షతన ఈ తరగతులు జరిగాయి. పార్టీ కేంద్ర కమిటీ నాయకుడు కేజే. రామచందర్, జిల్లా నాయకులుగుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, అశోక్, జి. రామయ్య,బందెల వెంకయ్య, వెంకటరెడ్డి, యలదండి బాబు, పాశంఅప్పారావు, గోకినపల్లి లలిత, శిరోమణి పాల్గొన్నారు.

# పట్టభద్రులారా తీన్మార్ మల్లన్న ఆశీర్వదించండి

## – సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్



**ఖమ్మం రూరల్, సూర్య మేజర్ న్యూస్**

సిపిఐ, సిపిఎం పార్టీలు బలపరిచిన ఖమ్మం- నల్గొండ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను పట్టభద్రులు ఓటు వేసి ఆశీర్వదించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్ లో సిపిఐ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టబద్రులను తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ప్రశ్నించే గొంతుకలు ఈ సమాజానికి అవసరమని, అటువంటి వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంపటి సురేందర్, వెన్నం భాస్కర్, వెంపటి రాము, మేళ్లచెరువు గురవయ్య, రవి, యువజన సంఘం నాయకులు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, రెబగోడ్ల గోపి, తనకం భాస్కర్, పొన్నెకంటి అఖిల్, తేలూరి రవి, కాంగ్రెస్ నాయకులు ఖాదర్, ఎన్ పి చారి, కళ్లెం శేశిరెడ్డి పాల్గొన్నారు.

# అఖిలభారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ABAP) కమిటీలో కాటేపల్లికి దక్కిన అరుదైన గౌరవం

## -కాటేపల్లికి హర్షం వ్యక్తం



**కల్లూరు సూర్య మేజర్ న్యూస్ మే (20) :**

కల్లూరు పట్టణం మదిర రోడ్డులో నివాసం ఉంటున్న కాటేపల్లి రజనీకాంత్ కు అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ABAP) కమిటీని ఆదివారం ఖమ్మం నగరంలో గల గోపాల పురంలోని అఖిలభారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఏబీఏపీ కార్యాలయంలో ఎన్నికలను నిర్వహించడం జరిగింది. ఎన్నికల అధికారిగా తమిళనాడు నుండి పాండవన్ వెంకటేషన్ ,రాష్ట్ర కోశాధికారి అయిన అబ్జర్వర్ బండి కట్ల శ్రీనివాసచార్యులు , ఈ సభకు ముఖ్య అతిథులుగా వ్యవహరించడం జరిగింది . అందులో భాగంగా అఖిలభారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఏబీఏపీ కమిటీ ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా కాటేపల్లి రజనీకాంత్ రెండోసారి జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగిందని, వారు తెలిపారు అనంతరం కాటేపల్లి మీడియాతో మాట్లాడుతూ, నా సేవలను గుర్తించి రెండోసారి ఈ అవకాశం కల్పించిన జిల్లా కమిటీ వారికి పేరుపేరునా ప్రత్యేకంగా శుభాకాంక్షలు ఇటువంటి కార్యక్రమాలు రాబోవు రోజుల్లో మరెన్నో చేసి అందరితో అన్యోన్యంగా ఉంటూ ఆహార్నిశలు శ్రమిస్తానని ఆయన మీడియాతో తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ అఖిలభారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ కార్యదర్శి చిత్రా రవి కోశాధికారిగా చెరుకూరి కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్ను కోవడం జరిగిందని వారు తెలిపారు .దీనిలో ఖమ్మం జిల్లా నుండి ఎనిమిది బ్రాంచ్ ల సంఘం సభ్యులు,జాతీయ పిఆర్ఓ గంగి శెట్టి రాజా, రాష్ట్ర కార్యదర్శి టీవీ పుల్లం రాజు ,జోనల్ సెక్రటరీ ఇస్లావత్ నగేష్, సభ్యులు కల్లూరు వాసులు మల్లాది బసవయ్య, సత్యం, ఆళ్ల వెంకటేశ్వరరావు, అప్పలనాయుడు ,ఇతర బ్రాంచ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా జూనియర్ యన్ టీ ఆర్ జన్మదిన వేడుకలు



**కల్లూరు సూర్య మేజర్ న్యూస్ మే (20) :**

మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల శ్రీరామ్ పురం వీధిలో సోమవారం లింగాల గోపి రాజ్ ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను వారు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం వారు భారీ కేక్ కట్ చేసి స్వీట్స్ , మిఠాయిలు పంపిణీ చేశారు. అందులో భాగంగా గోపి రాజ్ మీడియాతో రాబోవు రోజుల్లో ఇటువంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకుంటామని గోపి అన్నారు. శ్రీ రాంపురం వీధిలో ఒక కన్నుల పండుగగా ఈ జన్మ దిన వేడుకలు జరుపుకున్నామని గోపి మీడియాతో తన ఆనందాన్ని పంచుకున్నారు. తన సన్నిహితులు వీధి వారంతా, ఈ వేడుకలను కన్నుల పండుగగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తన్నీరు ఉపేందర్, తురగా మురళి, పిట్టల నరసింహ , మేరుగు శ్రీకాంత్ మేరుగు అనిల్ , వీధి ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తల్లాడ సూర్య మేజర్ న్యూస్:-**

33కేవీ కుర్నవల్లి ఫెడర్ లో మరమ్మత్తుల దృష్ట్యా కుర్నవల్లి,మిట్టపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అసిస్టెంట్ ఇంజనీర్ పి సుందర్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సబ్ స్టేషన్ లో పరిధిలో ఉన్న కుర్నవల్లి,ముద్దునురు,కలకొడి మ,రంగాపురం,కేశ్వాపురం, పుణ్యపురం బస్వాపురం,మిట్టపల్లి, పినపాక,వెంకటాపురం రామానుజవరం,లక్ష్మీపురం, మాల్సూర్ తండా,రంగం బంజార, నారాయ బంజర,నూతనకల్ మరియు వెంగన్నపేట గ్రామాలలో విద్యుత్తు సరఫరా లో అంతరాయం కలుగుతుందని, కావున ఆయా గ్రామాలలోని విద్యుత్ వినియోగదారులు అందరు సహకరిచగలరని ఆయన కోరారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి జి ప్రమోద్ రెడ్డిని గెలిపించండి

### -మారుతి నేని ధర్మారావుపిలుపు



**వైరాసూర్యమేజర్ న్యూస్:ు**

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 27 వ తారీఖున జరగబోయే ఖమ్మం. నల్గొండ. వరంగల్. ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి గా పోటీ చేయుచున్న గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి గెలుపును కాన్సిస్తూ వైరా బిజెపి కార్యాలయం నందు పత్రిక సమావేశం ఏర్పాటు చేయనైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఖమ్మం జిల్లా క్లస్టర్ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే మారుతి నేని ధర్మారావు.మరియు జిల్లా అధ్యక్షులు శ్రీ గల్లా సత్యనారాయణ జిల్లా ఇన్చార్జి బంటు రమేష్ పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశం అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించడం జరిగినది . ఈ కార్యక్రమంలో శ్రీ ధర్మారావు గారు మాట్లాడుతూ పూటకు ఒక పార్టీ మారుతూ ప్రజలని మోసం చేస్తూ సొంత టీవీ ఛానల్ లో ప్రసారం సాగిస్తూ ఏ ఎండకి ఆ గొడుగు పడుతూ ఈరోజు పట్టభద్రుల ను కూడా మోసం చేస్తూ ఓట్లు దండుకొని గెలవాలని చూస్తున్నా అభ్యర్థులకి కాకుండా నిజాయితీగా నిరంతరం పార్టీ కోసం విద్యార్థి దశ నుండి పార్టీకి పనిచేస్తూ ప్రజల సమస్యలపై ఉద్యోగ నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఉన్న మన గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ప్రతి ఒక్క మేధావిని ప్రతి ఒక్కపట్టభద్రులని ఈ పత్రిక ముఖంగా కోరుచున్నామన్నారు. అలాగే భవిష్యత్తు మొత్తం భారతీయ జనతా పార్టీ దేనిని దేశం ఒక భారతీయ జనతా పార్టీతోనే అభివృద్ధి చెందగలదని నిరూపితం అయిందని ప్రపంచంలోనే పెద్దన్న పాత్ర పోషించగలరని మోడీ గారు నిరూపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ శ్యామ్ రాథోడ్ జిల్లా నాయకులు శ్రీ రుక్మారావు .రాష్ట్ర రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుశ్రీ కొవ్వూరి నాగేశ్వరరావు . జిల్లా నాయకులు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులుశ్రీ చావా కిరణ్ .శ్రీ నరుకుల్ల వెంకటేశ్వరరావు . వైరా టౌన్ అధ్యక్షులు ఏలే భద్రయ్య. దుద్దుకూరి కార్తీక్ .కోసూరి గోపాలకృష్ణ. తుప్పటి మల్లికార్జున్ .నల్లమోతు రమేష్. వైరా టౌన్ జనరల్ సెక్రటరీ మనుబోలు వెంకటకృష్ణ. పాప కంటి నరేష్ . ఓర్సుశ్రీను. చింతనిప్పు రామారావు . ఇజ్జ గాని మురళి. కృష్ణ కాంత్. దుర్గం జయశ్రీ .కుమారి. మల్లేశ్వరి. అంజలి. తిరుమల.

## నాగులవంచ వాసికి బంగారు పతకం....



**చింతకాని సూర్య మెజర్ న్యూస్:-**

మారుమూల గ్రామానికి చెందిన చెట్టుపోగు సింహాద్రి తన ఊరు ను యావత్ భారతదేశానికి పరిచయం చేశాడు.ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన చెట్టుపోగు సింహాద్రి కి జాతీయ స్థాయిలో నిర్వహించిన పరుగుపందెంలో బంగారు పతకం దక్కింది.చెట్టుపోగు వీరబాబు దేవమణి దంపతుల కుమారుడు సింహాద్రి పదో తరగతి వరకు గవర్నమెంట్ పాఠశాల లో చదివాడు ఇంటర్ నాగలవంచ గవర్నమెంట్ కళాశాల లో చదివాడు ఇటీవల కాలం లో వరంగల్ లో అగ్నివీర్ డిఫెన్స్ అకాడమీ లో ఆర్మీ కి శిక్షణ చూస్తున్న తరుణంలో ఢిల్లీలో నిర్వహించిన ఫిట్ ఇండియా ఫెడరేషన్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో పరుగు పందెం పోటీలు నిర్వపి ాస్తున్నట్లు తన అకాడమీ, కోచ్ ద్వారా తెలుసుకొని ఢిల్లీ కి వెళ్లి పోటీలో పాల్గొన్నాడు మే 18 నుండి 21 వరకు ఢిల్లీలో లో పోటీలు జరిగాయి దేశం లో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన యువకుల తో పోటీ పడి తన ప్రతిభ తో మొదటి స్థానం లో నిలిచిన చెట్టుపోగు సింహాద్రి జాతీయ స్థాయి లో పరుగు పందెం లో మొదటి స్థానం సాధించినందుకు జూన్ 20 నుండి 25 జరుగునున్న అంతర్జాతీయ పోటీలలో పాల్గొననున్నారు.

## ప్రశ్నించే గొంతుక రాకేష్ రెడ్డి గెలుపుతోనే సమస్యలు పరిష్కారం

**-ప్రభుత్వ వ్యతిరేక ఓటు రాకేష్ రెడ్డి కే..**

**-సిట్టింగ్ సీటు నిలబెట్టుకునేందుకు శ్రమించాలి**

**-పట్టభద్రుల ఓటర్లకు బీఆర్ ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు పిలుపు**













**సూర్య మెజర్ న్యూస్:-**

ప్రశ్నించే గొంతుక ఏనుగుల రాకేష్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించి, శాసన మండలి కి , పంపించి, ఆశీర్వదించాలని బీఆర్ఎస్ పార్టీ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పట్టభద్రుల ఓటర్లను కోరారు.వరంగల్ - నల్గొండ - ఖమ్మం నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ ఎస్ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ఈ సాయంత్రం ఖమ్మం ఎస్బీఐటీ కాలేజ్ లో పట్టభద్రుల తో సమావేశం జరగనుంది. సమావేశ ఏర్పాట్లను ఎంపీ నామ సోమవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై నిర్వాహకులతో సమీక్షించారు. అనంతరం నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యలను చట్ట సభలో గొంతెత్తి సత్తా చాటే దమ్మున్న వ్యక్తి రాకేష్ రెడ్డి అని అన్నారు. ఆయన్ని ఎన్నుకుంటే నిరుద్యోగులకు మరింత న్యాయం జరుగుతుందని చెప్పారు.ప్రభుత్వ వ్యతిరేక ఓటు రాకేష్ రెడ్డి కే పడుతుందని భావిస్తున్నామని తెలిపారు. రాకేశ్రెడ్డి గెలుపు ద్వారానే ఉద్యోగుల, నిరుద్యోగుల, విద్యార్థుల సమస్యలు పరిస్కారమవుతాయని అన్నారు. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు పార్టీ కేడర్ మరింత పట్టుదలతో పని చేయాలని అన్నారు.ఎంతో విలువైన ఓటును రాకేష్ రెడ్డి కే వేసి, సద్వినియోగం చేసుకోవాలని నామ నాగేశ్వరరావు అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్, ఆర్జేసీ కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షులు పగడాల నాగరాజు, మోరంపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

**ఓణీల ఫంక్షన్ లో హారిణిని ఆశీర్వదించిన నామ నాగేశ్వరరావు**

సింగరేణి మండలం మాధారం గ్రామంలో మాసారపు సంపత్ - కరుణ దంపతుల కుమార్తె హరిణి ఓణీల ఫంక్షన్ సోమవారం జరగగా, బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొని,అక్షింతలు వేసి, నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని హారిణిని దీవించి, ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా. నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్, మోరంపూడి ప్రసాద్ , పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కిలారు వెంకటేశ్వర్లు, కిలారు నాగేశ్వరరావు, కోయ శేషయ్య , స్థానికులు పాల్గొన్నారు.

# నేడు పాలేరు నియోజకవర్గం ఎమ్మెల్సీ సన్నాక సమావేశం

**-తిరుమలాయపాలెం మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు యూత్ నాయకులకు ఆహ్వానం**



తిరుమలాయపాలెం, సూర్య మేజర్ న్యూస్ :- నేడు ఖమ్మం రూరల్ పరిధిలో టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పై పాలేరు నియోజక వర్గ సన్నాహక సమావేశం ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న విజయాన్ని ఆకాంక్షిస్తూ పాలేరు నియోజక వర్గ సన్నాహక సమావేశం మంగళవారం ఉదయం 9.30 గంటలకు జరగనుంది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు అభ్యర్థి తీన్మార్ మల్లన్న హాజరవుతాన్నారు కావున ఈ సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు మిత్రపక్ష నాయకులు విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ తెలిపారు.

## శిక్షణ తరగతులు ప్రారంభించండి....

**-ఏవో కి వినతిపత్రం అందజేసిన గ్రామీణ వైద్యుల సమాఖ్య నాయకుల**



ఖమ్మం,సూర్య (మేజర్ న్యూస్) ఉమ్మడి జిల్లాలో ఉన్న గ్రామీణ వైద్యులకు శిక్షణ తరగతులు ప్రారంభించాలని గ్రామీణ వైద్యుల సమాఖ్య సంఘాల జెఏసి నాయకులు ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బొమ్మినేని కొండలరావు బోయినపల్లి శ్రీనివాస్ రావు మైనారిటీ సంఘం రాష్ట్ర నాయకులు నజీర్దున్ జిల్లా అధ్యక్షుడు హసన్ గ్రామీణ పట్టణ ఐక్యవేదిక అధ్యక్షుడు పిల్లలమర్రి సుబ్బారావు లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆర్ఎంపి ల ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ల పై ఎన్ఎంసి టిఎస్ఎంసి లు కలిసి సంయుక్తంగా చేస్తున్న దాడులపై డిఎండ్ హెచ్ఎం కార్యలయంలో అందుబాటులో ఉన్న ఏవో మోత్యా నాయక్ కి వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం లో తమకు శిక్షణ ఇచ్చారని తిరిగి అదే తరహ శిక్షణ ఇవ్వాలన్నారు. ఆర్ఎంపిలకు అండగా నిలవండి... నున్నా ని కలిసిన గ్రామీణ వైద్యుల సమాఖ్య (జెఏసి)సంఘాల నాయకులు... గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అతీ తక్కువ ఖర్చుతో ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉంటూ వైద్యం అందిస్తున్న తమ పై ఎన్ఎంసి టిఎస్ఎంసి చేస్తున్న దాడులతో ఇబ్బందులు పడుతున్నామని తమకు అండగా నిలవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ని సిపిఎం కార్యలయంలో కలసి సమస్యలు వివరించారు.ప్రధాన సమస్య అయిన 428 జీవో ని సవరించాలని ఆ జీవో సవరించే వరకు తమకు మద్దతుగా నిలవాలన్నారు.ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో మాట్లాడి అందరం కలిసి రాష్ట్ర ప్రభుత్వం ద్రుష్టికి విషయాన్ని తీసుకెళ్దామని హామీ ఇచ్చారు. మీ వెంట సీపీఎం పార్టీ ఉంటుందన్నారు. పరిమితికి మించి వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వైద్యం చేయకుండా ప్రాథమిక చికిత్స మాత్రమే ఇవ్వాలన్నారు.ఈకార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సమాఖ్య (జెఏసి)నాయకులు కొంగర గోపి ఎస్కే రామారావు షేక్ నాగుల్ మీరా గోపాల్ పుల్లారెడ్డి రహీం రబ్బానీ రామారావు ఖదీర్ ఖాసీం పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ కరుణించేనా?

**-అన్నదాతలు ఖరీఫ్ పంటలపై ఆశలు పెట్టుకున్నారు. ఈ యేడైనా ఖరీఫ్ ఆదుకునేనా అని ఎదురుచూస్తున్నారు**

**-గత ఖరీఫ్ రైతులను కన్నీళ్లు పెట్టించింది**

**-గత సీజన్‌లో అకాల వర్షాలతో తీవ్ర నష్టం**


**-ఈ యేడు వాతావరణ పరిస్థితిపై ఆశలు**

**-పంటల ప్రణాళికకు వ్యవసాయశాఖ కసరత్తు**

**-వరి, పత్తికి పెద్ద పీట**

**-రైతులు సూచనలు పాటించాలంటున్న అధికారులు**










తిరుమలాయపాలెం, సూర్య మేజర్ న్యూస్ :- తిరుమలపాలెం అన్నదాతలు ఖరీఫ్ పంటలపై ఆశలు పెట్టుకున్నారు. ఈ యేడైనా ఖరీఫ్ ఆదుకునేనా అని ఎదురుచూస్తున్నారు. గత ఖరీఫ్ రైతులను కన్నీళ్లు పెట్టించింది. ఈయాసంగి కూడా వారి ని యాతనకు గురి చేసింది. అకాల వర్షాల వల్ల పంటలు పోయి కన్నీళ్లే మిగులుతున్నాయి. కష్టాల సేద్యం తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సమాయత్తం అవుతున్నారు. ఆ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ ఖరీఫ్ పంటల ప్రణాళికకు తుదిరూపం ఇస్తోంది. గత ఖరీఫ్‌లో సాగైన పంటల విస్తీర్ణం, ఎదురైన ప్రతిబం? దకాలు, విస్తీర్ణంలో చోటుచేసుకున్న హెచ్చుతగ్గులను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికకు కసరత్తు చేస్తోంది.

**ఈ ఏడాదైనా కలిసి వచ్చేనా..?**

ఈ ఏడాదైనా సాగు కలిసి వస్తేనే రైతులకు మేలు కలిగే అవకాశం ఉంది. కష్టాల నుంచి కాస్తయినా గట్టెక్కగలుతారు. గతేడాది ఖరీఫ్ రైతులకు ఏ మాత్రం కలిసి రాలేదు. పద్ద శ్రమంతా వృథాగానే పోయింది. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనున్న పత్తి.. ఆరు క్వింటాళ్లకే పరిమితమైంది. అయితే గత ఏడాది ఖరీఫ్ లో ఏసియన్ అగ్రి జెనెటిక్స్ వారి వింధ్య అనే పత్తి విత్తనాలు వాడిన రైతులకు మాత్రం సుమారుగా 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని ఈ గత ఖరీఫ్ విత్తనాలు వాడిన రైతులు తెలియజేశారు.ఇతర కంపెనీల విత్తనాలు వాడిన కొంతమంది రైతులకైతే సగటున 5క్వింటాళ్ల దిగుబడి సైతం రాలేదు. ఆశించిన ధరలు లభించక రైతులు అన్ని విధాలుగా నష్టపోవాల్సి వచ్చింది. ఈ యాసంగిలో సైతం రైతులు తీవ్రంగా పంట నష్టపోయారు. అకాల వర్షాల వల్ల వరి, మొక్కజొన్న పంటలతో పాటు మామిడి చేతికిరాకుండా పోయింది. వచ్చే ఖరీఫ్ అయినా తమను ఆదుకుంటుందన్న ఆశతో ఉన్నారు......అయితే గత ఏడాది ఖరీఫ్ లో ఏసియన్ అగ్రి జెనెటిక్స్ వారి వింధ్య అనే పత్తి విత్తనాలు వాడిన రైతులకు మాత్రం సుమారుగా 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని ఈ సంవత్సరం విత్తనాలు వాడిన రైతులు తెలియజేశారు

**రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి**

వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికకు కసరత్తు పూర్తయింది. వాతావరణం అను కూలించి ఖరీఫ్ ఆశాజనంగా ఉండగల దని ఆశిస్తున్నాం. సాగు విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకే వర్షానికి విత్తనాలు వేయకుండా రైతులు సంయమనం పాటించాలి. నేలంతా తడిసిన తర్వాత వర్షాలకు అనుకూలంగా విత్తనాలు వేసుకోవాలి. వాతావరణ విషయా లపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచ నలు, సలహాలు తీసుకోవాలి. తమ వ్యవసాయశాఖ పక్షాన విత్తనాలు, ఎరువుల కసం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటాం.

# నేడు టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పై పాలేరు నియోజక వర్గ సన్నాహక సమావేశం

**- హాజరు కానున్న తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



ఖమ్మం సూర్య బ్యూరో : ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న విజయాన్ని ఆకాంక్షిస్తూ పాలేరు నియోజక వర్గ సన్నాహక సమావేశం మంగళవారం ఉదయం 10గంటలకు జరగనుంది. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు అభ్యర్థి తీన్మార్ మల్లన్న హాజరవుతారని పేర్కొన్నారు. కావున నియోజక వర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు పట్టభద్రులు అధిక సంఖ్యలో హాజరై వారి మద్ధతును తీన్మార్ మల్లన్నకు తెలపాలని దయాకర్ రెడ్డి కోరారు.

# సోమ్లా నాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలి

**- వైద్యులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు**

**- అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షునికి శ్రీనివాస రెడ్డి పరామర్శ**



హైదరాబాద్: సూర్య మేజర్ న్యూస్ :- ఇటీవల అస్వస్థతకు గురై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు బాణోతు సోమ్లా నాయక్ ను తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. ఆయన మనవడు బాణోతు ఉత్తేజ్ నాయక్, కుటుంబ సభ్యులను అడిగి సోమ్లా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని ఈ సందర్భంగా వైద్యులను ఆదేశించారు.